

మహిళా సాధికారతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిచేందుకు మహిళాశక్తి పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా జిల్లాలో 23 రకాల యూనిట్ల ఏర్పాటుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. త్వరలో ప్రారంభించేదుకు చర్యలు తీసుకుంటున్నారు.



కలెక్టరేట్‌లో ప్రారంభం కానున్న క్యాంటీన్

మహిళలకు అండ

- మహిళాశక్తి పథకంతో ఆర్థికంగా చేయూత
- ఆసక్తి ఉన్న యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళికలు
- ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారుల చర్యలు
- జిల్లాలో 9,178 మందికి లబ్ధి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 10: మహిళలను ఆర్థికంగా బలోపే తం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన మహిళాశక్తి పథకంతో జిల్లాలో వేలాది మందికి శాశ్వత జీవనోపాధి లభించనుంది. సుమారు 23 రంగాల్లో యూనిట్ల ఏర్పాటుకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికా రులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జిల్లాలోని 345 గ్రామ పంచాయ తీల్లోని 8,100 గ్రామ సంఘాలకు మహిళాశక్తి పథకం వర్తింపచేసి రూ. 98.78 కోట్లతో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పక్కా ప్రణాళికలు రుపొందించారు. దీంతో సుమారు 9,178 మంది మహిళలకు లబ్ధి చేకూ రనుంది. ఇప్పటికి 23 రకాల యూనిట్లలో గ్రామ సంఘాల్లోని మహిళల ఆసక్తి మేరకు యూనిట్లు నెలకొల్పుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 233 యూనిట్లు ప్రారంభించారు. త్వరలో కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు.

398 గ్రామ సంఘాలు..

జిల్లాలో 398 గ్రామ సంఘాలు, 8,100 స్వయం సహాయక సంఘాల్లో 90,112 మంది సభ్యులున్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. బ్యాంకు లింకేజీ కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 898 స్వయం సంఘాలకు రూ. 52.73 కోట్ల రుణ సదుపాయం కల్పించింది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో కలిసి మహిళా శక్తి పథకం యూనిట్ల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 33.83 శాతం మహిళా సంఘాలను ఈ పథకం కింద అర్హులుగా గుర్తించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహిళాశక్తి పథకంలో భాగంగా జిల్లాకు కేటాయించిన యూనిట్లను త్వరగా ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

23 రకాల యూనిట్లు..

మహిళాశక్తి పథకం కింద 23 రకాల యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో క్యాంటీన్లు, చేపల పెంపకం, పాడి పశువులు, పాడి ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు, ఆధార్, మీసేవా కేంద్రాలు, దేశీవాళీ కోళ్ల పెంపకం, పౌల్ట్రీఫాం, ఎంటర్‌ప్రైజేస్ యూనిట్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయా యూనిట్లను నిర్వహించేందుకుగాను మహిళలకు బ్యాంకులు, స్త్రీనిధి, మండల మహిళా సమాఖ్య ద్వారా వడ్డీలేని రుణాలు అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా అర్హత గల లబ్ధిదారులను గుర్తించి క్షేత్ర స్థాయిలో యూనిట్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. త్వరలో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క చేతుల మీదుగా మహిళాశక్తి యూనిట్లను ప్రారంభించేందుకు జిల్లా గ్రామీణాభి వృద్ధిశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచన మేరకు నాలుగు చోట్ల మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టరేట్ సముదాయంలో, జిల్లా ఆసుపత్రి, కౌటాలలోని బస్టాండు ఏరియాలో, కుమరంభీం ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ రూపొం దించారు.

నాలుగు క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు..



దత్తరాం, డీఆర్డీవో

జిల్లా వ్యాప్తంగా నాలుగు క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇందులో కొన్ని మొబైల్ క్యాంటీన్లు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. ఆసక్తి చూపించే మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నాం. బ్యాంకు రుణాలు ఇప్పించి క్యాంటీన్లు ఏర్పాటు చేయిస్తాం. కలెక్టరేట్‌లోని క్యాంటీన్‌ను త్వరలోనే ప్రారంభిస్తాం.

ఆర్థికాభివృద్ధికి అవకాశం



మార స్వరూప, మండల సమైఖ్య అధ్యక్షురాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళాశక్తి పథకంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అవకాశంగా భావిస్తున్నాం. ఆసక్తి గల సభ్యులందరిని ఈ పథకంలో భాగస్వామ్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే మండలాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

తిర్యాణి, సెప్టెంబరు 10: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా మంగళవారం తిర్యాణి మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పాఠాలు బోధించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యార్థుల ప్రతిభను గుర్తించడానికి జిల్లాలోని ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నామని తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. నీతి ఆయోగ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేష్, ఎంపీవో సుదాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు అంజయ్య, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- డీఈవోకు మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 10: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం డీఈవో అశోక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని వెంటనే ఉపసంహకరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, దివాకర్, కాంతమ్మ, బుజ్జమ్మ, విజయ, లక్ష్మి, ఆశక్క తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

దహెగాం, సెప్టెంబరు 10: సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని డీపీవో భిక్షపతి గౌడ్ అన్నారు. ఐనం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీల్లో ఓటరు జాబితా సవరణలను పూర్తి చేయాలన్నారు. వర్షాలు అధికంగా కురుస్తున్నందున చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. డ్రైనేజీలు, మురికి నీరు నిలువ ఉన్న చోట క్లోరినేషన్ చర్యలు చేపట్టాల న్నారు. ఎల్ఆర్ఎస్ పెండింగ్, వినాయక నిమజ్జనం ఉత్సవాలు తదితరాలపై సమీక్షించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీహెచ్‌సీ ఎదుట కార్మికుల ధర్నా



సీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు


ఆసిఫాబాద్, సెప్టెంబరు 10: ఆసిఫాబాద్ సీహెచ్‌సీలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్‌కేర్ కార్మికులకు పెండిగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ గుర్తింపు కార్డులతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉపేందర్, శ్రీశైలం, మల్లేష్, సత్తార్, మురళీ, మమత, నీల, గుణవంతరావు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించొద్దు

కెరమెరి, సెప్టెంబరు 10: జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు చేపట్టకూడదని ఎస్సై విజయ్ అన్నారు. మండల కేంద్రంలో పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఆదివాసీ సంఘాల నాయకులతో ఎస్సై సమావేశం నిర్వహించారు. అలాగే పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ సంఘాల నేతలు మాట్లాడుతూ వలస వాదులతోతమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వలసలను అరికట్టాలని కోరారు., సమావేశంలో నాయకులు మోతిరాం, భరత్ భూషన్, రాజేశ్వర్, ఇందిర, రఘునాథ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

- చాకలి ఐలమ్మకు నివాళులు అర్పించిన కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ఆసిఫాబాద్‌లో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే



రెబ్బెనలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 10: మహనీయుల పోరాటం స్ఫూర్తిని భావిత రాలకు అందిద్దామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా వెనకబడిన తరగుతల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీష్‌బాబు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అణగా రిన వర్గాల అభ్యున్నతి, భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసిన ధైర్యశాలి, వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. స్వాతంత్ర ఉద్యమం, తెలంగాణ సాయుధ తొలి దశ పోరాటంలో ఎందరో మహనీయుల కృషి ఉందని చెప్పారు. వారి పోరాట పటిమను ఆదర్శంగా తీసుకొని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వెనకబడి తరగతుల అభివృద్ధి శాఖాధికారి సజీవన్, పీఏసీఎస్ ఛైర్మన్ అలీబీన్ అహ్మద్, రజక సంఘం అధ్యక్షుడు మల్లయ్య జ్యోతిబాపూలే సంఘం అధ్యక్షుడు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా తహసీల్దార్ రాంమోహన్ రావు ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో రజకార్లను ఎదురించి వీరోచిత పోరాటం చేసిన వీర మహిళ చాకలి ఐలమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కడతల మల్లయ్య, తక్కపల్లి మాజీ ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, రజక మండల నాయకులు శంకర్, డిప్యూటీ తహసిల్దార్ ప్రేం కిరణ్, రోళ్లపాడు మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్, నాయకులు శ్రీధర్, జుముడి ఆనంద్, వార్డుమెంబర్ గోగర్ల రాజేష్, ఏర్గటి రామన్న, లవద్య, ప్రేంకుమార్, పోతురెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

బెజ్జూరు: మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, రాకేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని చాకలి వాడలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రతి ఒక్కరూ ఆమె ఆశయాల సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు హనుమంతు, శంకర్, రాజయ్య, సాయి, తదితరులు పాల్గొన్నారు.



కోల్‌ఇండియా పోటీల్లో విజయం సాధించాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 10: కోల్‌ఇండియా పోటీల్లో వాలీబాల్ జట్టు విజయం సాధించి సింగరేణి కీర్తిని చాటాలని మందమర్రి ఏరియా క్రీడల గౌరవ కార్యదర్శి మాస్కుల కార్తీక్ తెలిపారు. మందమర్రి 60వ వార్షిక క్రీడల్లో భాగంగా మంగళవారం వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల ప్రారంభమైన వార్షిక క్రీడలకు అన్ని ఏర్పాట్లు చేయనున్నామని తెలిపారు. సింగరేణి యాజమాన్యం కార్మిక క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ శివకుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రమ దోపిడీకి గురవుతున్న కాంట్రాక్టు కార్మికులు



మాట్లాడుతున్న కాంట్రాక్టు కార్మికులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 10: సింగరేణి సంస్థలోని ఆయా విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని సీఐటీయూ అనుబంధ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఏరియాలోని కేకే ఓసీపీలో మంగళవారం కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తే కాంట్రాక్టర్లు లాభాలు పొందుతున్నారని, కానీ వీరి సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు . కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేస్తామని చెప్పిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేద న్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెగ్యులర్ చేయకపోవడం సరైంది కాదన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా సమానపనికి సమాన వేతనం అందించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం అక్టోబరు 4న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తలపెట్టామని చెప్పారు. కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతర చలో హైదరాబాద్ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- రెండు దశాబ్దాలుగా సులభ్ కాంప్లెక్స్ కార్మికుల పోరాటం

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న

శ్రీరాంపూర్, సెప్టెంబరు 10: సింగరేణిలో పనిచేసే సులభ్ కాంప్లెక్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీ యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకన్న డిమాండ్ చేశారు. సింగరేణి సులభ్ కాంప్లెక్స్ కార్మికుల రాష్ట్ర సదస్సు నస్పూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల సౌకర్యార్థం కోల్‌బెల్ట్ వ్యాప్తంగా సుమారు 200లకు పైగా సులభ్ కాంప్లెక్సులను నిర్మించారన్నారు. వాటిలో పనిచేస్తున్న కార్మికులకు ఎలాంటి హక్కులు, సౌకర్యాలు కల్పించలేదన్నారు. తమ యూనియన్ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలుగా పోరాడుతుండగా, కేవలం మినిమం వేజ్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. సులభ్ కాంప్లెక్స్‌లు శుభ్రం చేసేం దుకు వాడే కెమికల్స్ ప్రమాదకరంగా ఉంటాయన్నారు. వాటి వలన కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. దోమల వలన ఇతర ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయన్నారు. ఈ.ఎస్.ఐ., ఈ.పీ.ఎఫ్ సౌకర్యం కల్పించాలని, బోనస్ అందించాలని తమ యూనియన్ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నా సింగరేణి యాజమాన్యంగాని, సులభ్ ఇంటర్నేషనల్ గాని స్పందించడం లేదని ఆరోపించారు. వెంటనే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం. జ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కోశాధికారి మల్లన్న, ఎస్‌సీసీడబ్ల్యూయూ రాష్ట్ర నాయకులు గజ్జి మల్లేష్, శోభ, అరుణ, సులబ్ వర్కర్స్ పాల్గొన్నారు.

లాభాల వాటా 35 శాతం చెల్లించాలి

- హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 10: సింగరేణి కార్మికులకు లాభాల వాటా ఎంత వచ్చిందో యాజమాన్యం తెలియజేయాలని, వెంటనే 35 శాతం లాభాల వాటా చెల్లించాలని హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి, అన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయం వద్ద మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లాభాల వాటా చెల్లించే తేదీని ప్రకటించి 35 శాతం లాభాల వాటా చెల్లించాలన్నారు. త్వరలోనే లాభాల వాటా కోసం తమ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ నేతృత్వంలో ముఖ్యమంత్రిని కలుస్తామని తెలిపారు. లాభాల వాటా వస్తే కార్మికులకు ఎంతో ఆర్థికంగా ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. గుర్తింపు పత్రం పొందిన ఏఐటీ యూసీ యాజమాన్యంపై లాభాల వాటా కోసం ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సుదర్శన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 10: సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. శ్రీరాంపూర్ ఏరియాలో 108 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఖాళీలను భర్తీ చేసేందుకు యాజమాన్యం ప్రకటన ఇచ్చిందని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ చేసి 98 మంది పేర్లతో మెరిట్ లిస్ట్ తయారు చేశారని పేర్కొన్నారు. ఆదివారం కౌన్సెలింగ్ ఉందని యాజమాన్యం చెప్పినప్పటికీ శనివారమే కౌన్సెలింగ్ రద్దు చేస్తున్నట్లు గనులు, విభాగాలపై నోటీసులు అంటించారని తెలిపారు. అధికారులు తప్పులమీద తప్పులు చేస్తూ కార్మికులను ఆందోళనకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. జీఎం స్పందించి రాజకీయ, యూనియన్ నాయకుల ఒత్తిళ్లకు గురికాకుండా సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులకు ఇబ్బందులు కలుగకుండా, న్యాయం జరిగే వరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.

హెచ్‌బీఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య

శ్రీరాంపూర్, సెప్టెంబరు 10: హౌస్ బిల్డింగ్ లోన్ రీయింబర్స్‌మెంట్ స్కీమ్(హెచ్‌బీఎల్ఆర్ఎస్) దరఖా స్తులనే వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్య దర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఒక ప్రకటనలో ప్రశ్నించారు. శ్రీరాంపూర్ డివిజనల్‌లో ఇంటి రుణం తీసుకున్న కార్మికులు సింగరేణి సంస్థ చెల్లించే వడ్డీ కోసం దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు. వాటి పరిష్కారంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదని పేర్కొన్నారు. కార్మికులు ఎన్నిసార్లు తిరిగినా వారికి సరైన సమాధానం రావడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలని కోరారు.

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 10: సింగరేణిలో మూడు నుంచి నాలుగు దశాబ్దాల పాటు సింగరేణి సంస్థ అభివృద్ధికి కృషి చేసి ఉద్యోగ విరమణ పొందిన తాము ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని రిటైర్డు కార్మికులు వాసాల శంకర్, రేణికుంట్ల కొమురయ్య, రమణలు అన్నారు. స్థానికంగా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సింగరేణిలో రెండున్నర దశాబ్దాల క్రితం రిటైర్ అయిన కార్మికులకు రూ. 500 నుంచి వెయ్యి పింఛన్ వస్తుందన్నారు. ఇటీవల రిటైర్ అయిన కార్మికులకు 10 నెలలు కావస్తున్నా గ్రాట్యూటీ చెల్లించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 11వ వేజ్‌బోర్డుతో కూడిన పింఛన్‌ను అమలు చేసి ఏరియార్స్ కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే రిటైర్డు కార్మికుల మహాసభ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వడ్డీ లేని రుణం అందించాలి

- ప్రతి ఒక్కరికీ 250 గజాల స్థలం ఇవ్వాలి
- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్, సెప్టెంబరు 10: సింగరేణి కార్మికులు ఇళ్లు నిర్మించుకునేందుకు వడ్డీ లేని రుణం అందించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి డిమాండ్ చేశారు. ఆర్కే-7 గనిపై మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌కు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతీ కార్మికుడికి 250 చదరపు గజాల ఇంటి స్థలం, 50 లక్షల రూపాయల వడ్డీ లేని రుణం అందించాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాలపై 40 శాతం వాటా చెల్లించాలని కోరారు. కోల్ ఇండియాలోని అన్ని అనుబంధ కంపెనీలలో, సింగరేణిలో యూనియన్ సభ్యత్వ ధృవీకరణ నమోదు పద్ధతి చెక్ ఆఫ్ సిస్టమ్, పారిశ్రామిక సంబంధాల వ్యవస్థను కొనసాగించాలన్నారు. 11వ వేతన ఒప్పందం ప్రకారం ఆమోదించిన ఒప్పందాలను జాప్యం లేకుండా అమలు చేయాలని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మించాలని చెప్పారు. మహిళా ఉద్యోగులకు సాధికారత కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, కేంద్ర కార్యదర్శి రాగం రాజేందర్, బీఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడకుంటి శ్రీధర్, నాయకులు బోయిన మల్లేష్, కట్కూరు సతీష్, గోళ్ల మహేందర్, మోతె ఓదెలు, కుంట రాజు, నాగరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

కాగజ్‌నగర్, సెప్టెంబరు 10: కాగజ్‌నగర్ మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ కాసర్ల శ్రీనివాస్ సోమవారం మృతి చెందగా మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీనివాస్ మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. మున్సిపల్ ఛైర్మన్ షహీన్ సుల్తానా, మాజీ మున్సిపల్ ఛైర్మన్ దస్తగిర్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సిబ్బంది నివాలులర్పించారు.

జాగృతి యాత్రను జయప్రదం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 10: నషా ముక్త్ భారత్ అభియాన్ జాగృతి యాత్రను జయ ప్రదం చేయాలని బ్రహ్మకుమారి ఈశ్వరియా విశ్వవిద్యాలయం నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రానికి రానున్నట్లు తెలిపారు.

చింతలమానేపల్లిలో ముసురు వాన

చింతలమానేపల్లి, సెప్టెంబరు 10: మండల వ్యాప్తంగా మంగళవారం ఎడతెరిపి లేకుండా ముసురు వాన కురిసింది. మండలంలోని కేతిని- దిందా గ్రామాల మధ్య ఉన్న వారు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో దిందా గ్రామాల ప్రజలకు రాక పోకలు నిలిచిపోయాయి. వర్షాలకు పలు గ్రామాల రోడ్లు బురదమయంగా మారడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీ

ఆసిఫాబాద్, సెప్టెంబరు 10: జాతీయ ఆరోగ్య పథకంలో ఒప్పంద ప్రాతిపదికన వైద్యాధికా రుల పోస్టులను భర్తీ చేయనున్నామని డీఎంహెచ్‌వో తుకారాం మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్యా ఆరోగ్య పథకం కింద 8 వైద్య అధికారుల పోస్టులను భర్తీ చేసేందుకు ఈ నెల 12న ముఖాముఖి పద్ధతిన దరఖాస్తులు స్వీకరించనున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్య

జీడిమెట్ల, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులు భరించలేక ఓగృహిణి ఇంట్లోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈసంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా, సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రాంతంలోని సిర్‌సిల్క్‌కాలనీకి చెందిన బత్తిన ముత్యాలరావు కుమార్తె శిరీషా (28) నాలుగు సంవత్సరాల క్రితం నానక్‌నామ్ గూడలోని మైహోమ్ విహన్యాలో బ్యూటీషియన్ చేసింది. ఆసమయంలో బ్యూటీ పార్లర్‌లో పనిచేసే జగద్గిరిగుట్ట సోమయ్యనగర్‌కు చెందిన సూరజ్(28) పరిచయం అయ్యాడు. కొంత కాలం తర్వాత వారిద్దరు ప్రేమించుకుని పెళ్లి చేసుకోవడానికి నిర్ణయించుకుని పెద్దలకు చెప్పారు. కులంతర వివాహం కావడంతో శిరీషా కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించలేదు. చివరికి ఇరు పెద్దలు కూర్చుని 2023 సెప్టెంబరు 2వతేదిన వివాహం జరపించారు. రెండు లక్షలనగదు, ఐదు తులాల బంగారం, ఇతర ఇంటిసామగ్రి ఇచ్చారు. పిల్లలు పుట్టిన తర్వాత మరో రెండు లక్షల రూపాయలు ఇస్తామని అంగీకరించారు. కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావాలని శిరీషాను భర్త, అత్తమామలు తీవ్రవేధింపులకు గురిచేడయంతో ఆమె మంగళవారం మధ్యాహ్నం ఉరేసు కుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసునమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

మైనర్ బైక్ రైడర్ల బైండోవర్

చెన్నూరు, సెప్టెంబరు 10: ఇన్‌స్టాగ్రామ్‌లో లైక్‌ల కోసం బైకులపై విన్యాసాలు చేస్తున్న ఇరువురు పోకిరీలను అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కొమ్మెర గ్రామానికి చెందిన అజయ్ (అజ్జు రైడర్), కిష్టంపేటకు చెందిన మేకల రాజ్‌కుమార్‌లు మైనర్లు అయినప్పటికీ బైక్‌లపై విన్యాసాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇరువురు పోకిరీలతోపాటు మైనర్లకు బైక్‌లు ఇచ్చిన వారి తండ్రులపై కేసు నమోదు చేసి తహసీల్దార్ మల్లికార్జున్ ఎదుట హాజరు పర్చినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు బైకులు ఇవ్వరాదని హెచ్చరించారు.

వైన్‌షాప్ చోరీ కేసులో దొంగల అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

చెన్నూరు, సెప్టెంబరు 10: పది రోజుల క్రితం కోటపల్లి మండలం పారుపెల్లి వైన్‌షాపులో దొంగతనానికి పాల్పడిన ఇరువురు దొంగలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 1న రాత్రి ఎంఎస్ వైన్‌షాపు తలుపులు పగులగొట్టిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. షాపు వెనకభాగంలోని తలుపులు పగులగొట్టిన దొంగలు రూ.1,43,280 విలువ గల మద్యం బాటిళ్లు, సీసీ కెమెరా, రూ. 31,370 నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు యజమాని మహేందర్ ఫిర్యాదు చేశాడు. సర్వాయిపేట ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో సర్వాయిపేటకు చెందిన మేకల లక్ష్మణ్, కమాన్‌పూర్ మండలం పెంచికలపేట గ్రామానికి చెందిన కోటకుమార్‌లను విచారించగా వైన్‌షాపులో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. మేకల లక్ష్మణ్ కొంత కాలంగా 8 ఇంక్లైన్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి పెంచికలపేటకు చెందిన కోట కుమార్, గండి కోట దర్మేందర్, కలకుంట బన్నీలతో పరిచయం ఏర్పడిందన్నారు. ఈ నెల 1న రాత్రి చెన్నూరు పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో ఆటోను దొంగలించారు. ఆటోలో పారుపెల్లికి వెళ్లి వైన్‌షాపులో దొంగతనం చేశారన్నారు. చోరీ చేసిన మద్యాన్ని గోదావరిఖని,8 ఇంక్లైన్‌లో అమ్ముకున్నారన్నారు. చోరీ చేసిన ఆటో, మేకల లక్ష్మణ్, కుమార్‌లను అరెస్ట్ చేశామని, మరో ఇద్దరు నిందితులు కోట దర్మేందర్, బన్నీలు పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. చెన్నూరు సీఐ రవీందర్,ఎస్ఐ శ్వేత, కోటపల్లి ఎస్ఐ రాజేందర్‌లు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

కాసిపేట, సెప్టెంబరు 10: మండలంలోని ముత్యంపల్లికి చెందిన మారం గట్టయ్య (50) ఒంటరితనం భరించలేక మంగళవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గట్టయ్యకు 25 ఏండ్ల క్రితం వివాహమైంది. కొన్ని రోజులకే విడాకులు కావడంతో మద్యానికి బానిసయ్యాడు. కూలీపనులు చేసుకుంటూ జీవిస్తూ మద్యం సేవించేవాడు. ఒంటరితనం భరించలేక ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి



చంద్రయ్య (ఫైల్)

జైపూర్, సెప్టెంబరు 10: మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాం గ్రెస్ నాయకులు సిద్దం చంద్రయ్య (87) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. జైపూర్ ఉపసర్పంచుగా రెండుదఫాలుగా పనిచేశాడు. ఆయా పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

గణేష్ నిమజ్జనానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు



బెల్లంపల్లి పోచమ్మ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, ఆర్డీవో, ఏసీపీ, గూడెం గోదావరి నది నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, సీఐ తదితరులు

బెల్లంపల్లి, సెప్టెంబరు 10: గణేష్ నిమజ్జనానికి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత పేర్కొన్నారు. మంగళవారం నిమజ్జనం కోసం బెల్లంపల్లి పోచమ్మ చెరువు వద్ద ఏర్పాట్లను ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్‌లతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ చెరువులో నిమజ్జనం కోసం పూడికతీత చేపట్టామన్నారు. చెరువు చుట్టు పక్కల ప్రాంతాలను శుభ్రం చేయించామని, గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజున పోలీసు నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు అస్మాషేక్, రాములునాయక్, సీఐ పాల్గొన్నారు.

దండేపల్లి: గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని తహసీల్దార్ సంధ్యరాణి, సీఐ అల్లం నరేందర్, ఎంపీడీవో ప్రసాద్‌లు సూచించారు. గూడెం, ద్వారక గోదావరినది వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గూడెం గోదావరి నదిలో నీటిమట్టం ఎక్కువ ఉన్నందున భక్తులు నదిలోకి వెళ్లకుండా ఏర్పాటు చేయాలన్నారు. గూడెం చెక్‌పోస్టు నుంచి గోదావరి తీరం వరకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. గూడెం, ద్వారక వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు చేపడుతామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, ఎస్సై ఉదయ్‌కిరణ్, శ్రీనివాస్, కట్కూరి రాజన్న ఉన్నారు.

తాండూర్: వినాయక నిమజ్జనంలో అపశ్రుతులు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టనున్నట్లు సీఐ కుమారస్వామి అన్నారు. తాండూరు పెద్ద చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. తగిన లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఎస్సై కిరణ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ ఉన్నారు.

కరెన్సీతో గణనాథునికి అలంకరణ



మందమర్రిలో కరెన్సీతో అలంకరణ

మందమర్రిటౌన్, సెప్టెంబరు 10: పట్టణంలోని బాలాజీ స్వీట్ హౌజ్‌లో ప్రతిష్ఠించిన గణనాథునికి మంగళవారం రూ.2.30 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. రూ. 200, 100 నోట్లను అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. గణనాథునికి స్వీట్ హౌజ్‌కు వచ్చిన వారితో పాటు ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని ప్రాణహిత కాలనీలోని వినాయక మండపంలో ఎస్ఐ రాజశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఐని సన్మానించారు.

మందమర్రిరూరల్: మండల వ్యాప్తంగా గణనాథునికి ఘనంగా పూజలు నిర్వహించారు. మహిళలు హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. నైవేద్యాలను సమర్పించారు. 108 అరటి పండ్లతో వాయినం పెట్టారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

దండేపల్లి: వినాయక మండపల వద్ద నిత్యం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మ్యాదరిపేటలో పోచమ్మవాడలో సిద్దివినాయక మండపం వద్ద ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ జెడ్పీ వైస్ చైర్మపర్సన్ మర్రి ప్రవీణరెడ్డి-చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు పూజలు చేశారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న రంగు వేణుకుమార్

నస్పూర్, సెప్టెంబరు 9: వనితా వాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం మంచిర్యాల పట్టణంలోని మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సైకలాజిస్ట్ రంగు వేణు కుమార్ మాట్లాడుతూ ఆశయ సాధనకు నలుగురికి ఆదర్శంగా నిలువాలన్నారు. తొందరపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రతీ సమస్యకు ఒక పరిష్కారాన్ని చూపుతూ రెట్టింపు ఉత్సాహంతో ఉన్నత లక్ష్యాల వైపు అడుగువేయాలన్నారు. ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడితే కన్న వారికి కడుపు కోత మిగిల్చిన వారవుతారన్నారు. వనితా వాక్కు ఫౌండేషన్ గౌరవ అధ్యక్షురాలు, మోటివేషన్ స్పీకర్ జ్యోత్న చంద్రదత్, కో ఫౌండర్స్ కవిత, పట్టణ కమిటీ అధ్యక్షురాలు చందన, ప్రిన్సిపల్ పాండురంగ శర్మ, కళాశాల సిబ్బంది వనితా వాక్కు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కుల గణన చేపట్టాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 10 : రాష్ట్రంలో కుల గణన చేపట్టాలని, బీసీల సంక్షేమానికి కృషి చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పూదరి శ్రీకాంత్‌గౌడ్, జిల్లా నాయకులు పోలు శ్రీనివాస్, కొండిళ్ల శ్రీనివాస్‌లు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ జనాభా నిష్పత్తి ప్రకారం 60 శాతం ఉన్న బీసీలు వెనకబడి ఉన్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా బీసీలంతా హక్కుల సాధన కోసం పోరాడుతున్నారన్నారు. ప్రభుత్వాలు బీసీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. బీసీలను విస్మరిస్తే పోరాటాలు తప్పవన్నారు. త్వరలోనే మండల, గ్రామ, పట్టణాల వారీగా సమావేశాలను ఏర్పాటు చేసి కమిటీలను ఎన్నుకుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు. నాయకులు శంకర్, రాజయ్య, సతీష్, శ్రీనివాస్, నర్సోజీ, సారంగం, శంకర్, జగదాంబ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

దండేపల్లి, సెప్టెంబరు 10: నెల్కివెంకటాపూర్ చెందిన శాతరాజు విజయకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మ్యాదరిపేట చెందిన చీర్ల రమాదేవి సతీష్ పుట్టినరోజు సందర్భంగా రెండు నెలలకు సరిపడా సరుకులతోపాటు 25 కేజీల బియ్యం అందజేశారు. ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సంగర్స్ రాజేశ్వర్‌రావు, కట్ట వెంకటేష్, అధ్యక్షకార్యదర్శి చెన్నవేని భానుప్రసాద్, అల్లంల కుమారస్వామి, ప్రచార కార్యదర్శి గడికొప్పుల వినోద్‌కుమార్, కార్యదర్శి శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 10 : మండలంలోని మాలగురిజాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆరుగురికి జ్వరాలు ఉండడంతో మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీవో మహేందర్ పరిశీలించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది మల్లిక, అరుణబాయి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు లాభాల వాటా 38 శాతం చెల్లించాలి

● మావోయిస్టు కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులతోపాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం 38 శాతం లాభాల వాటాను ప్రకటించి, ఈ నెలాఖరులోపు చెల్లించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రమ దోపిడీకి గురవుతున్న కాంట్రాక్టు కార్మికులు ఎలాంటి కనీస ప్రాథమిక హక్కులు పొందడం లేదని తెలిపారు. సింగరేణి ఆర్జిస్తున్న లాభాల్లో పర్మినెంట్ కార్మికులతోపాటు కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ ఎంతో ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలకులు కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటాను ప్రకటించకపోగా, అసెంబ్లీ సాక్షిగా సింగరేణిలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఒప్పంద కార్మికులే లేరని అసత్య ప్రచారం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పాలకులు కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలలో ప్రధానమైన కార్మికుల సొంతింటి పథకం, ఇన్‌కం టాక్స్ పెర్క్స్ అలవెన్సులను యాజమాన్యం అమలు చేయడం, మారు పేర్లు, అండర్ గ్రౌండ్ గనుల తవ్వకాలు, కొత్త ఉద్యోగాల కల్పన, కాంటాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ఐదు జాతీయ సంఘాల నాయకులు కేవలం పైరవీలకు అలవాటుపడి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

సహకార సంఘం కార్యదర్శుల సస్పెన్షన్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 10: సహకార సంఘాల్లో విధుల్లో నిర్లక్ష్యం చేసినందుకు కోటపల్లి, కర్ణమామిడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులను సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎరువుల వ్యాపారం చేయకపోవడం, ఎరువుల దుర్వినియోగానికి పాల్పడి నగదును చెల్లించకపోవడం, సకాలంలో గన్నీ సంచుల రికాన్సిలేషన్ ప్రక్రియ ముగించకపోవడంతో కోటపల్లి సహకార సంఘం కార్యదర్శి రాజ్యానాయక్‌ను పదవి నుంచి తొలగించామని తెలిపారు. సహకార సంఘంలో సక్రమంగా ఎరువుల వ్యాపారం చేయకుండా నిర్లక్ష్యం చేసినందుకు కర్ణమామిడి సహకార సంఘం కార్యదర్శి ప్రశాంత్‌ను పదవీ నుంచి తొలగించడం జరిగిందన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు వినతి

మంచిర్యాల, సెప్టెంబరు 10: మున్సిపాలిటీలోని కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌కు కాంట్రాక్టు కార్మికులు వినతి పత్రం అందించారు. కొందరికి పీఎఫ్ కట్ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వయస్సు పైబడిన, అనారోగ్యంతో ఉన్నవారి స్థానంలో కుటుంబీకుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 19న మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడతామన్నారు. కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు హరికృష్ణ, అధ్యక్షుడు ఆశయ్య, శ్యాంకుమార్, శ్రీనివాస్, తిరుపతి, లక్ష్మీనారాయణ, రాజేశం, రాజం, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సిర్పూర్(టి), సెప్టెంబరు 10: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. సిర్పూర్(టి) మండలంలో మంగళవారం పీఆర్టీయూటీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిచాలని, పెండింగ్‌బిల్లులను మంజూరు చేయాలన్నారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, దేవాజీ, సదాశివ్, ప్రకాష్, జావీద్ అహ్మద్, వెంకటరమణ, సుధాకర్, పవన్, జ్యోతి, చిన్న, అంకు, సరిత, షబానాబేగం, యాష్మిన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్ఏఎస్ పరీక్ష

కౌటాల, సెప్టెబరు 10: కౌటాల మండల కేంద్రంలోని పాఠశాలల్లో మంగళవారం 3, 6, 9వ తరగతి విద్యార్థులకు ఎన్ఏఎస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షను నిర్వహించారు. మండలంలోని ముత్తంపేట ప్రాథమిక పాఠశాల, కౌటాల జిల్లా పరిషత్ పాఠశాలలను మండల నోడల్ అధికారి హనుమంతు సందర్శించి పరీక్ష నిర్వహించే విదానాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి వంట చేసే వారికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు, సీఆర్పీ ప్రకాష్ తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



పార్టీ సభ్యత్వ నమోదు చేపడుతున్న జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్యేలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 10: జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి ముల్కల మల్లారెడ్డి, ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించన పార్టీ సభ్యత్వ నమోదు క్యాక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 1,20,000 సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని చేరుకోవాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. బీజేపీ సభ్యత్వం తీసుకునేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల్లోనే ప్రజల వ్యతిరేతకను ఎదుర్కొంటుందన్నారు. కాంగ్రెస్‌పార్టీ గ్రూపు రాజీయాలు ఎక్కువ య్యాయని, బీజేపీ పరిపాలన కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ప్రజల ముందు ఎండగడుతామన్నారు. ప్రస్తుతం బీజేపీలో ఉన్న వవారు కూడా సభ్యత్వం తీసుకోవాలన్నారు. నాయకులు పార్టీన స్థానాలకు ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజా సమస్యలపై కార్యకర్తలు నిత్యం ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. ఇప్పటి వరకు రైతులకు రుణ మాఫీ కాలేదని, రైతు భరోసాపై ఊసేలేదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్, మురళీ, విశాల్, విజయ్, కిరణ్, సొల్లు లక్ష్మి, ఆంజనేయులుగౌడ్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా

- సామాజిక ఆస్పత్రిని సందర్శించిన సబ్ కలెక్టర్



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

సిర్పూర్(టి), సెప్టెంబరు 10: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా మంగళవారం అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా వైరల్ జ్వరాలతో సామాజిక ఆసుప త్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సోమవారం ఎనిమిది మంది విద్యార్థులు చికిత్స తీసుకున్నారు. ఇందులో నలుగురికి జ్వరం తగ్గడంతో వారిని వసతి గృహానికి తరలించారు. మరో నలుగురు చికిత్స పొందుతుండడంతో మరో రెండు రోజుల పాటు వైద్యం అందించాలని డాక్టర్ అనూష, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణకు సూచించారు. అలాగే వసతి గృహంలో మరో వారం రోజుల పాటు ఆరోగ్య శిబిరం నిర్వహించి అందరికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతర నవేగాంలో లోనవెల్లి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ నవత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్యం, మురికి కాలువల్లో బైటెక్స్ స్ప్రే, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కార్యద ర్శిని ఆదేశించారు. అవసరం ఉన్న చోట వైద్య శిబిరం నిర్వహించాలలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్, గిర్దావర్ మోహన్, తదితరులు ఉన్నారు.

సేవాభావంతో విధులు నిర్వహించాలి



నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 10: జాతీయ ఆరోగ్య పథకం కింద ఒప్పంద పద్ధతిన నియమితులైన వారు సేవాభావంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో మంగళవారం ఒప్పంద పద్ధతిన స్టాఫ్ నర్సు, ఎంఎల్‌హెచ్‌పీ, ఫార్మాసిస్టులు, ఇతర క్యాడర్లలో నియమితులైన వారికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారాం భట్‌తో కలిసి నియమాక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ ఆరోగ్య పథకం కింద 58 మందిని ఒప్పంద పద్ధతిన నియమించామని తెలిపారు. అన్ని వృత్తులలోకన్న వైద్య వృత్తి చాలా గొప్పదన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటం బాధ్యతగా తీసుకోవాలని, సేవా భావంతో తమ వృత్తిని నిర్వహించాలని సూచించారు. నియమితులైన వారిలో జిల్లాకు చెందిన వారు ఉన్నారని, విధులలో సమయ పాలన పాటించాలన్నారు. ప్రజలకు జవాబుదారితనంతో సేవ చేయాలని తెలి పారు. వర్షాకాలం కావడంతో ముఖ్యంగా సీజనల్ వ్యాధులు, విష జ్వరాలను నియంత్రించేందుకు తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

చిన్నరాస్పెల్లిలో వైద్య శిబిరం

దహెగాం, సెప్టెంబరు 10: దహెగాం మండలంలోని చిన్నరాస్పెల్లి, బామానగర్ గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారిణి అశ్విని ప్రజలకు వైద్య పరీక్షలు మందులు అందజేశారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో హెచ్ఏ ఓదేలు, ఏఎన్ఎంలు జేబి, శాంత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 10: జిల్లా కేంద్రంలోని ఎస్టీవోస్ కాలనీలోని గణేశుడికి అదనపు కలెక్టర్ దాసరి వేణు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానంలో పాల్గొన్న భక్తులకు బోజనం వడ్డించారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని సాయినివాడలోని శివసాయి గణేష్ మండలి వద్ద కుంకుమార్చన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాగజ్‌నగర్: పట్టణంలో గణనాథుల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయం సమీపంలో, భగత్‌సింగ్ రోడ్‌లో, శ్రీ దుర్గ గణేష్ మండలితో పాటు పలు కాలనీల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదోన్నతి పరీక్షలు

రెబ్బెన, సెప్టెంబరు 10: బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్ వద్ద బెల్లంపల్లి రీజియన్(శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి) పరిధిలోని అండర్ గ్రౌండ్ ఫిట్టర్ ఉద్యోగులకు ఈపీ పిట్టర్ ట్రెయినీ పదోన్నతి కోసం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. 17 మంది పిట్టర్ ఉద్యోగులు పరీక్షలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కె.రాజమల్లు, ఏరియా ఇంజనీర్ భిబూరాంరావు జాడే, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇందారం 1ఏ గనిలో కార్మికుడి మృతి

- గాలి సరఫరా లేకపోవడమే కారణమంటూ ఆందోళన



శ్రీనివాస్(ఫైల్)

జైపూర్, సెప్టెంబరు10: మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం 1ఏ బొగ్గు గనిలో మంగళవారం మొదటి షిఫ్టు విధులు నిర్వహిస్తున్న జనరల్ మజ్దూర్ ఎలవేని శ్రీనివాస్(37) మృతి చెందాడు. పని స్థలంలో గాలి సరఫరా లేకపోవడంతోనే శ్రీనివాస్ మృతి చెందాడని, గని ప్రమాదంగా గుర్తించాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు గనిపై ధర్నా చేపట్టారు. శ్రీనివాస్‌తో పాటు పలువురు కార్మికులు మొదటి షిఫ్టు విధుల్లో భాగంగా గనిలోని రిటర్న్ జాలి వద్ద 35డీ ఆఫ్ 4లెవెల్ పని స్థలంలో విధులు నిర్వహిస్తున్నాడు. 11.30 గంటలకు మేషన్ పనిచేస్తున్న శ్రీనివాస్ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. కొద్ది సేపటికి పని స్థలంలోనే మృతి చెందాడని కార్మికులు అంటున్నారు. శ్రీనివాస్‌ను హుటాహుటిన ప్రైవేటు అంబులెన్స్‌లో రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించామని, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందా డని అధికారులు పేర్కొన్నారు. పని స్థలంలో గాలి సక్రమంగా లేకపోవడంతోనే కార్మికుడు మృతిచెందాడని, గని ప్రమా దంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, కార్మికులు ధర్నాకు దిగారు. ఏరియా ఆసుపత్రి వద్ద శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరించేందుకు వెళ్తుండగా అంబులెన్స్ ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుడు శ్రీనివాస్ కుటుం బం గోదావరిఖనిలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటోంది. ఇందారం 1ఏ గని పని స్థలంలో గాలి సరఫరా లేక పోవడంతోనే తన భర్త శ్రీనివాస్ మృతిచెందాడని, దీనిపై విచారణ చేయాలని మృతుడి భార్య అనిత జైపూర్ పోలీ సులకు ఫిర్యాదు చేశారు.

యువత వ్యసనాల బారిన పడొద్దు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 10: యువత వ్యసనాల బారిన పడొద్దని ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు అన్నారు. పట్టణంలో మంగళవారం అంబేద్కర్ కూడలిలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దన్నారు. యువత లక్ష్యం చేరుకునేందుకు క్రమశిక్షణతో చదవాలని సూచిం చారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి మనిషా, బ్రహ్మకుమారిలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.


భూ ఆక్రమణలపై ఫిర్యాదు

బెజ్జూరు, సెప్టెంబరు 10: మండల కేంద్రంలో భూ ఆక్రమణలపై మంగళవారం తహసీల్దార్ భూమేశ్వర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఉమ్మెర లింగయ్య అనే వ్యక్తి తెలిపాడు. మండల కేంద్రంలోని సర్వే నెం.760/2, 760/1, 760/55లో ఐదు ఎకరాల భూమి ఉండగా ఇందులో రెండు ఎకరాలు పోలీసు స్టేషన్, మిగితా భూమిని కస్తూర్బా పాఠశాలకు కేటాయించాచని చెప్పారు. ఇట్టి భూమి ఆక్రమణకు గురైందని చెప్పాడు. అదే విధంగా సర్వే నంబరు 237లో రెండు ఎకరాల 10 గుంటల భూమి వార సంతకు కేటాయించారని, ఆ స్థలాన్ని కబ్జా చేశారని ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వం స్థలాలను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని భూములను ప్రభుత్వ ఆదీనంలోకి తీసుకు రావాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మల్లేష్, షణ్ముఖ, అకీం, సల్మాన్ ఉన్నారు.



గణేష్ నిమజ్జనానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు
7లో..
ఇందారం 1ఏ గనిలో కార్మికుడి మృతి

కాసులు కురిపిస్తున్న నాలా కన్వర్షన్



ప్రభుత్వ ఆదాయానికి గండి

- ఫామ్ ల్యాండ్ పేరుతో గుంటల్లో విక్రయాలు
- వ్యవసాయ భూములను నివాస స్థలాల కింద మార్పు
- భూమిని గజాల్లోకి మార్చేందుకు ముడుపులు
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దందా

మంచిర్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. వ్యవసాయ భూములను నివాస ప్లాట్లుగా మార్చేందుకు నాలా (నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్‌మెంట్ యాక్టు) కన్వర్షన్ చేయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం అన్ని డాక్యుమెంట్లు, ఇతర సదుపాయాలు ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారుల చేతులు తడప నిదే కన్వర్షన్ కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ వెంచర్లు ఏర్పాటు చేస్తే పన్నుల భారం పడుతుందని భావిస్తున్న రియల్టర్లు వ్యవసాయ భూములను ఫామ్ ల్యాండ్‌గా పేర్కొంటూ గుంటల్లో విక్రయిస్తున్నారు. గుంటల్లో కొనుగోలు చేసిన వ్యక్తులు నాలా కన్వర్షన్ చేయిం చేందుకు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు ప్రాంతాన్ని బట్టి వసూళ్లు చేస్తున్నారనే ప్రచారం ఉంది. ప్రధానంగా జిల్లా, మండల కేంద్రాలకు సమీపంలో ఉన్న రెవెన్యూ అధికారులకు నాలా కన్వర్షన్ కాసుల పంట పండిస్తోందనే చర్చ జరుగుతోంది. మరో వైపు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈ తరహా కొత్త డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

ధరణి రిజిస్ట్రేషన్‌తో అధికారులకు కాసులు...

రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా ఉన్న ప్రాంతాల్లో నాలా కన్వర్షన్ అధికారులకు కాసుల పంట పండిస్తోంది.

జిల్లాలో ఫామ్ ల్యాండ్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వెంచర్లు చేస్తే అనుమతులతోపాటు 10 శాతం భూమిని మున్సిపల్, గ్రామ పంచాయతీలకు పార్కుల అభివృద్ధికి వదిలి పెట్టాల్సి వస్తోంది. ఓ వైపు పన్నులు చెల్లించడంతోపాటు మరోవైపు భూమిని కోల్పోతుండటంతో పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లుతోందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు భావిస్తు న్నారు. దీంతో 10 ఎకరాల నుంచి వంద ఎకరాల వరకు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఫామ్ ల్యాండ్‌గా మారుస్తున్నారు. ఐదు గుంటల నుంచి ఆపైన ప్లాట్లుగా మారుస్తున్నారు. గజాల్లోకి మార్చాలంటే నాలా కన్వర్షన్‌తోపాటు అనుమతులు కూడా తీసుకొని లే అవుట్ చేయాల్సి ఉండటం ఆర్థిక భారాన్ని పెంచుతుండటంతో ఫామ్ ల్యాండ్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఫామ్ ల్యాండ్‌కు ఎలాంటి అనుమతులు అవసరం ఉండదు. తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణిలోనే ఐదు గుంటల చొప్పున భూమి కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. భూమి కొనుగోలు చేసిన వ్యక్తులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందుతున్నాయి. తాము కొనుగోలు చేసిన ఫామ్ ల్యాండ్‌ను గుంటల నుంచి గజాల్లోకి నాలా కన్వర్షన్ చేయిస్తున్నారు. దీంతో రియల్టర్లకు భారం తప్పుతుండగా, కొనుగోలు చేసిన వారికి తక్కువ ధరకే భూమి లభిస్తోంది. అయితే ప్రభుత్వానికి మాత్రం నష్టం వాటిల్లుతోంది. పన్నులు, లే అవుట్ రుసుం రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. జిల్లాలో వందల ఎకరాల్లో ఫామ్ ల్యాండ్ అమ్మకాలు జరుగుతున్నాయి.

మంచిర్యాల, లక్షెట్టిపేట, నస్పూర్, జైపూర్, చెన్నూరు, బెల్లంపల్లి, తాండూరు, హాజీపూర్‌లో రియల్ ఎస్టేట్ దందా సాగుతోంది. వ్యవసాయ భూముల్లో కొత్తగా వెంచర్లతో పాటు ఫామ్ ల్యాండ్‌లు ఏర్పాటవుతుండగా, వాటిని కొనుగోలు చేసిన వారు ప్లాట్లుగా మార్చుకుంటున్నారు. ఎకరాల భూమిని గుంట్లో అమ్మకాల సమయంలోనే ధరణిలో రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉంటుంది. ఆ సమయంలోనే రెవెన్యూ శాఖలో ఏరియాను బట్టి గుంట భూమికి రూ. 5 వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నాలా కన్వర్షన్ చేయాలంటే 200 గజాల స్థలానికి ఏరియాను బట్టి రూ. 10వేల నుంచి రూ. 50 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతి నెల పదుల సంఖ్యలో నాలా కన్వర్షన్, ఫామ్ ల్యాండ్ భూములను గుంటల్లో రిజిస్ట్రేషన్ చేయడం వంటి పనులకు భారీగానే ముడుపులు అందుతున్నాయనే చర్చ సాగుతోంది.

కొత్త డాక్యుమెంట్లకు అదనపు వసూళ్లు

వ్యవసాయ భూములను గుంటల్లో నుంచి గజాలకు నాలా కన్వర్షన్ చేయిం చిన తరువాత, అందులో కొంత భూమిని ఇతరులకు విక్రయించాలంటే మళ్లీ చేతులు తడపాల్సిందే. నాలా కన్వర్షన్ అయిన భూమి నుంచి కొన్ని గజాలను ఇతరులకు విక్రయించేందుకు కొత్త డాక్యుమెంట్ తయారు చేయాల్సి ఉం టుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కొత్త డాక్యుమెంట్ తయారీ, రిజిస్ట్రేషన్ పూర్త య్యే వరకు 200 గజాల స్థలానికి భూమి విలువను బట్టి రూ.20 వేల నుంచి రూ. 80 వేలకు పైగా ఖర్చవుతుందని సమాచారం. ఇందులో డాక్యుమెంట్ రైటర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ వరకు వాటాలు ఉంటాయనే ఆరోపణలున్నాయి. పాత డాక్యుమెంట్‌ల కంటే కొత్త వాటికి 40 శాతం అదనంగా వసూలు చేస్తారని సమాచారం.

టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడిని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న రిటైర్డు ఉద్యోగులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 10: టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడిని సస్పెండ్ చేయాలని రిటైర్డు ఉద్యోగులు అఫ్జల్ నబీ, బషీర్ అహ్మద్, పోచయ్యలు పేర్కొన్నారు. మంగళవారం చార్వాక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో తమకు ఇచ్చిన ప్లాట్లను వేరే వారికి అమ్ముతున్నాడన్నారు. అధికారులతో కుమ్మక్కై తమకు ప్లాట్లు లేవని, మరో చోట ఉన్నాయని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి మోసం చేస్తున్నాడన్నారు. ఇండ్లు కుట్టుకునే సమయంలో ప్లాట్లు తమవి కావని రిటైర్డు ఉద్యోగుల వద్ద నుంచి లక్షల రూపాయలు వసూలు చేసే కార్యక్రమాన్ని చేపట్టారని ఆరోపించారు. వరుస క్రమంలో ఉండాల్సిన ప్లాట్లను వేరే వారికి అప్పజెప్పడంతోపాటు ప్రశ్నించిన మాకు ప్లాట్లు లేకుండా చేస్తున్నారన్నారు. కలెక్టర్‌ను సంప్రదించినా న్యాయం జరగడం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి గడియారం శ్రీహరిని సస్పెండ్ చేసి అతనిపై విచారణ జరిపించాలని కోరారు. నాయకులు నర్సారెడ్డి, దేవపాల, రాజయ్య, కుర్షిద అహ్మద్‌ఖాన్, రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఆర్‌టీల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీఆర్‌టీలు

మంచిర్యాల, సెప్టెంబరు 10: సీఆర్‌టీ కౌన్సెలింగ్‌లో అవకతవకలు జరిగాయని జిల్లా కేంద్రంలోని ఐబీలో సీఆర్‌టీలు మంగళవారం నిరసన చేపట్టారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. సీఆర్‌టీలు మాట్లాడుతూ సీనియారిటీ, స్థానికత, మహిళలకు నియర్ బై పాఠశాలలు ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. ఇందుకు బాధ్యులైన ఏసీఎంవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సీఆర్‌టీలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తాం



స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, ఆర్డీవో తదితరులు

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 10: డంపింగ్‌యార్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. మంగళవారం ఆర్డీవో హరికృష్ణతో కలిసి పెద్దనపల్లిలోని డంపింగ్‌యార్డు కోసం స్థలాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ కొన్ని నెలలుగా పట్టణంలో డంపింగ్ యార్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. త్వరలోనే డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఏసీపీ రవికుమార్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు,కౌన్సిలర్లు రాములు నాయక్ అస్మాషేక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

బెల్లంపల్లి మండలంలో బుధవారం నుంచి పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనన్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు గ్రామాల్లో పారిశుధ్య పనులు కొనసాగుతాయని తెలిపారు.

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన వారితో జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

చెన్నూరు, సెప్టెంబరు 10: చెన్నూరు 2వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్, మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ బత్తుల సమ్మయ్య ఆధ్వర్యంలో పలువురు యువకులు బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి జెండావాడలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముకలా నిలవాలన్నారు. పార్టీలో చేరిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, కృష్ణమూర్తి, దుర్గం అశోక్, శ్రీనివాస్, సమ్మయ్య లక్ష్మీనారాయణ, శ్రీపాల్, శివకృష్ణ, రాజేష్, శ్రావణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి



విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

కాసిపేట, సెప్టెంబరు 10: ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాలపై ఉపాధ్యాయులు చొరవ చూపి మెరుగైన విద్యనందించాలని డీఈవో యాదయ్య అన్నారు. మంగళవారం దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని లేకుంటే చర్యలు తీసుకొంటామన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. రికార్డులను, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. నోడల్ అధికారి రాథోడ్ రమేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొనసాగుతున్న ఊర చెరువు సర్వే

భీమారం, సెప్టెంబరు 10 : మండల కేంద్రంలోని ఊర చెరువు సర్వే పనులు మంగళవారం కొనసాగాయి. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి చెరువు సర్వే చేపట్టారు. జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఊర చెరువు విస్తీర్ణంతో పాటు శిఖంను గుర్తించి హద్దులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటికే 85 శాతం సర్వే పనులు పూర్తయ్యాయని, మిగితా పనులను బుధవారం పూర్తి చేస్తామన్నారు. సర్వే పనులకు ఇబ్బందులు కలుగకుండా ఎస్ఐ రాములు బందోబస్తు నిర్వహించారు. ఇరిగేషన్ డీఈ శారద, ఏఈ అఖిల్, ఆర్ఐ స్రవంతి, సర్వేయర్ రామస్వామి ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

చెన్నూరు, సెప్టెంబరు 10: సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ అన్నారు. అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీని మంగళవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలన్నారు. విధులు సక్రమంగా నిర్వహించకపోయినా, సమయపాలన పాటించకపోయినా చర్యలుంటాయని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, ప్రోగ్రాం అధికారి అనిల్, పీవో ఫయాజ్‌ఖాన్, వైద్యులు కృష్ణతేజ, సత్యనారాయణ, డీఈఎంవో వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో జగదీష్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

వేమనపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎం హెచ్‌వో హరీష్‌రాజ్ సూచించారు. వేమనపల్లి పీహెచ్‌సీని సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. త్వరలో పీహెచ్‌సీకి ముగ్గురు స్టాఫ్ నర్సులను కేటాయిస్తామని పేర్కొన్నారు. నీల్వాయిలోని సబ్ సెంటర్‌ను సందర్శించారు. డాక్టర్‌లు అనిల్, రాజేష్, హెల్త్ సూపర్‌వైజర్ అపరంజి, ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్ రాంశెట్టి బాపు సిబ్బంది ఉన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 10 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌లో మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌తో కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా నిరంతరం కురుస్తున్న వర్షాల కారణంగా వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అత్యవసరం అయితే కంట్రోల్ రూమ్ 08736-250501కు సమాచారం అందించాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని గోదావరి నది తీర ప్రాంతాన్ని సందర్శించి నీటి ప్రవాహ పరిస్థితిని పరిశీలించారు.

ప్రజాసంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించాలి

జిల్లాలో చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయం నుంచి గూగుల్ మీట్ ద్వారా జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోజు పర్యటించాలన్నారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా మురుగు కాలువలు, అంతర్గత రహదారులు, నివాస ప్రాంతాల్లో నిలిచిన నీటిని తొలగించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు వివరించాలన్నారు. ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ పిచికారి చేయాలని సూచించారు. అధికారులు తమ పరిధిలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై పూర్తి వివరాలతో నివేదికలు అందించాలని తెలిపారు.

గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



గ్రామంలో పర్యటిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం, సెప్టెంబరు 10: గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం రాంపూర్, తిమ్మాపూర్, తపాలపూర్, సింగరాయిపేట, రోటిగూడ, చింతగూడ గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కడెం ప్రాజెక్టును పట్టించుకోలేదని, దీంతో ప్రాజెక్టు డేంజర్ జోన్‌లోకి వెళ్లిందన్నారు. లోతట్టు ప్రాంతాలు నీట మునిగినా పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.9.46 కోట్లు కేటాయించి కడెం ప్రాజెక్టు మరమ్మతు చేసిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కడెం ప్రాజెక్టు చెక్కు చెదరకుండా సురక్షితంగా ఉందన్నారు. వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను, కల్వర్టులను బాగు చేయిస్తామన్నారు. పంట నష్టపోయిన రైతులు దిగులు చెందవద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. త్వరలో అర్హులైన వారందరికి రేషన్ కార్డులు, కొత్త పింఛన్‌లు అందిస్తామన్నారు. ముజాఫర్, మహ్మద్ ఇసాక్, పసివుల్లా, స్వామి,లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. పేద కుటుంబాలకు పథకం ఎంతో భరోసా ఇస్తుందన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చస్తుందన్నారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, నాయకులు ముజాఫర్ ఆలీ, మహ్మద్‌ఇసాక్, పసివుల్లా, స్వామి, పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీ కూల్చివేత



నస్పూర్, సెప్టెంబరు 10: నస్పూర్ సర్వే నంబరు 42లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మించిన ప్రహరీని మంగళవారం సాయంత్రం టాస్క్ ఫోర్స్ బృందం ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేసింది. ప్రభుత్వ భూమి అని గుర్తించిన అధికారులు ప్రహరిని తొలగించారు. పోలీసుల బందోబస్తు మధ్య అక్రమ కట్టాడాలను నేలమట్టం చేశారు. కూల్చివేత సమయంలో మా పట్టా భూమిలోకి వస్తున్నారని అధికారులతో గోపాల్ రావు వాదనకు దిగే ప్రయత్నం చేశారు. సర్వేలో తేలిన ప్రకారం ప్రభుత్వ భూమిలో ఉన్న కట్టడాలను తొలగిస్తున్నామని అధికారులు సమాధానమిచ్చారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు సర్వే రిపోర్టు ఆధారంగా తాము కూల్చివేసామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. 25 గుంటల నుంచి 30 గుంటల వరకు కబ్జాకు గురై ఉంటుందన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండ కూల్చివేయడం అన్యాయమని బాధితుడు గోపాల్ రావు అన్నారు.

ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచాలి

చెన్నూరు, సెప్టెంబరు 10: ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచాలని పట్టణానికి చెందిన మనోజ్ అనే వ్యక్తి పేర్కొన్నారు. మనోజ్ కుమారుడు సాయి నిర్విగ్‌కు ఆరోగ్యం బాగా లేకపోవడంతో మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. ఆసుపత్రిలో సిరప్ బాటిల్ ఇవ్వగా సీల్ ఉన్నప్పటికీ లోపల మందులేదు. మరోటి ఇవ్వాలని కోరగా సిబ్బంది స్పందించలేదు. దీంతో మెడికల్ షాపులో సిరప్ కొనుగోలు చేసి తీసుకెళ్ళాడు. కలెక్టర్ స్పందించి విచారణ చేయాలని కోరాడు.

చాకలి ఐలమ్మ జీవితం అందరికీ మార్గదర్శకం



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 10: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జీవితం అందరికి మార్గదర్శకమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ విముక్తి ఉద్యమంలో నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటాలు మర్చిపోలేనివన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, అధికారులు వినోద్‌కుమార్, రజక సంఘం నాయకులు వెంకటేశం, భాగ్య, లక్ష్మణ్, బాపు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో రజక రిజర్వేషన్ సమితి నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మణ్‌రావు, ఎల్లయ్య, శ్రీకాంత్, రమేష్, కొమురయ్య, శంకర్, కుమార్, పాల్గొన్నారు.

దండేపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తిలు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి పురస్కరించుకొని దండేపల్లిలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కట్కూరి రాజన్న, మండల అధ్యక్షుడు పుట్టపాక తిరుపతి, ముత్యాల శ్రీనివాస్, సత్యం, వెంగళ్‌రావు, పాల్గొన్నారు. మాదాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మ్యాదరిపేట రజక సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోట్ బుక్స్‌తో పాటు పెన్నులు, పెన్సిల్స్‌ను మందపల్లి వెంకటేష్ పంపిణీ చేశారు.

నెన్నెల: చాకలి ఐలమ్మ వర్ధంతిని నెన్నెలలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నారపు తిరుపతి, ఆశాలు, వెంకటేష్, భీమయ్య, లచ్చన్న పాల్గొన్నారు.

కాసిపేట: చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక, ప్రజాసంఘాల నాయకులు కొండాపూర్ యాపలో నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మణ్, మల్లయ్య, హన్మంతు, రాజమౌళి,ధర్మయ్య, పాల్గొన్నారు.

చెన్నూరు: ఐలమ్మ వర్ధంతిని రజక కాలనీలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటరాజం, పోశమల్లు పాల్గొన్నారు.



మంచిర్యాలలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నస్పూర్: చాకలి ఐలమ్మ వర్ధంతిని మంచిర్యాల పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మంచిర్యాల పట్టణ రజక సంఘం అధ్యక్షుడు పారుపల్లి శ్రీనివాస్, నాయకులు పోశం, నస్పూరి పోశం, కుమార్, మహేష్, రమేష్, మల్లయ్య, అరుణ్, సురేష్, మధు, తదితరులు పాల్గొన్నారు.